రిలీవరు

బీనాదేవి

తాసీల్దారు రాజేశ్వర్రావుకి తెగకోపం వచ్చింది, రాని బస్సు మీద. వచ్చి నెత్తినెక్కి కూర్చున్న సూర్యుడిమీద. ఎప్పుడొస్తాడో తెలీని తన రిలీవరు మీద. తన ఉద్యోగం గజెట్చేసిన గవర్నమెంటు మీద. అసలు ఈ మధ్య జరిగినదేదీ అతనికి నచ్చలేదు. ఇంతవరకూ స్వంత ఊళ్లో, పుట్టిన జిల్లాలో కాలుమీద కాలేసుకొని దర్జాగా రాజాలా ఉద్యోగం చేసుకునే వాడు.

తనుద్యోగం గజెట్ చేసేక, తొలిసారి తన జిల్లా, మరో మూడుజిల్లాలూ తప్పించి బదిలీ చేశారు. "పిల్లకి పెళ్ళి చేసుకోవాలి బాబోయ్ బ్రాన్సఫరాపం"దన్నాడు. "కొత్త ఊళ్ళోనే చెయ్ పెళ్ళి" అన్నారు, పై అధికార్లు. "వీళ్ళకిదే శాస్తి" అని నాల్నెల్లు సెలవుపెట్టేశాడు, ఆ వూరు తప్పించుకుందికి.

సెలవ్ ఖర్చు తప్పిస్తే పిల్లపెళ్ళీ కాలేదు, బదిలీ తప్పలేదు. సెల వాఖర్ని అక్కడికే, మళ్ళీ ఆవూరే వెళ్ళమని మొండిపట్టుపట్టింది గవర్నమెంటు.

తన ఊరేం గొప్పదని కాదు; ఆ వూళ్ళో మిత్రుల్లా వుండే శత్రువులు, శత్రువుల్లా వుండే మిత్రులూ తప్పిస్తే మూడోరకం,మను షులు కన్పించరు. అన్నిట్లోనూ పాలిటిక్స్! ప్రతిదాన్లో లిటిగేషన్.

కాని ఎంతచెడ్డా తన సొంత వూరది. అందుకే దానిమీదంతభిమానం తనకి. అందులోనూ తాసిల్దారు పనంటే తమాషా కాదు. కరణాల పేచీలతో, మునసబుల మడతలతో నిండిపోయుంటుంది.

మునసబు మీసం చూసి చెప్పెయ్యాలి వాడు మిస్ప్రోప్రియేటరో కాదో.

కరణం కళ్లు చూసి కనిపెట్టెయ్యాలి కల్టివేషనేకౌంటుకుకప్ చేస్తాడో లేదో.

ఆ వచ్చే క్షురముండావాడు వస్తాడు ఈవూరి మతలబీ లర్థంకాక, గూడుపుఠాణీల్లో ఉక్కిరిబిక్కిరైపోతాడు. అందులోనూ డైరెక్టు రిక్రూట్టు. నా మొహంకాదూ! గుమాస్తాగా పుట్టి, రెవిన్యూ యినస్పెక్టరుగా పెరిగి, తాసిల్దారైన తనకే ఈ ఉద్యోగం లోతుల్లో అడుగు తగల్లంలేదే, ఇంక వాడేం చేసిచస్తాడు? ఎమ్మేపాసై పరీక్షల్లగెలెట్టినట్టుగాదు తాసీల్దారీ?

ఏదో వాడి ఖర్మాన వాడు పోతాడు. నా ఖర్మా వ్వేపోదును, బస్సొస్తే అనుకున్నాడు రాజేశ్వర్రావు.

బట్టతల యెండలో మెరుస్తూ మండిపోతోంది. ఖద్దరు చొక్కా చెమటకి తడిసిపోయింది. మధ్యాహ్నం పన్నెండైనా పదకొండు గంటల బస్సుతగలడిచావలేదు. బస్సుపోతున్న దన్న తొందర్లో కరణం వండించినా వడ్డించనివ్వకుండా బండిమీ దీవూరొచ్చేశాడు, కేంపెళ్ళినూర్చిరంచి.

ఆకలికి కడుపు మండిపోతోంది.

ఎండకి నెత్తి మండిపోతోంది.

బ్రాన్సఫర్లున్నాయంటే గుండె మండిపోతోంది.

కోపానికి ఒళ్లు మండిపోతోంది.

కాని బస్సు తగలళ్ళేదు.

కోపం దిగమింగి మెట్టూ మాశాడు రాజేశ్వర్రావు. కళ్లుమూసుకుని వో మున్నీదు చెట్టు చల్లని నీడలో తత్వాలు పాడుకుంటున్నాడు. ఎక్కడో సినిమాఎడ్వర్టయిజ్ మెంటు పాట గాలిలో కరిగి అలలుఅలలుగా, వినిపించీ వినిపించకుండా వినిపిస్తోంది. "గౌరమ్మా నీ మొగు డెవరమ్మా" అని పడవ్వా డెవడో చెవులు బద్దలు కొట్టేస్తున్నాడు. ఆ గౌరమ్మెవరో తెలీదుకాని ఈ పడవ్వాణ్ని మాత్రం మొగుణ్ని చేసుకోదు వీడి గొంతువింటే ననుకున్నాడు, రాజేశ్వర్రావు.

కాని బస్సు రాలేదు. వస్తేమాత్రం తనకి ఫ్రంటు సీటు దొరుకుతుందన్న నమ్మకమేమిటి? ఔర్మినస్టగ్గరైతే కండక్టరూ డ్రైవరూ బతిమాలి ఎక్కిస్తారు, తన్ని ఫ్రంటు సీట్లో. ఈమధ్య వూళ్లో ఎక్కితే తనకు ఫ్రంటుసీటు దొరకదు, అదిమాత్రం ఖచ్చితం. ఫ్రంటు సీట్లో వున్నవాడు ఫకీరు వెధవైనా సరే ఈ రోజుల్లో తనకోసం దిగమంటే దిగడు. పూర్వం రోజులైతేనా? తను రివిన్యూ యినస్పెక్టరుగా వున్న రోజులలో కూడా పెద్దపెద్ద మర్చెంట్లు ఖాళీ చేసేసే వారు తనకోసం ఫ్రంటుసీటు. 'ఈవేళెలా వుందో నాఅదృష్టం' అనుకున్నాడు.

వెంటనే ఈవేళ నా అదృష్టం బాగోలే దనుకున్నాడు. బస్సు మ్యాడగానే క్రైమ్ పిక్చర్లో దొంగవెధవలా ఎవడో 'ఫై'తో సహా టెర్లిన్ సూట్లో వుండి నల్లకళ్ళద్దాల్లోంచి ఎవర్ని చూస్తున్నాడో తెలీకుండా చూస్తూ కూర్చున్నాడు ఫ్రంటు సీట్లో.

వయ్యారంగా కూర్చున్నాడు. హాయి లొలకపోస్తూ కూర్చున్నాడు.

'భావనీ వెధవని' అనుకుంటూ కండక్టర్చూపించిన మూడో సీట్లో కూలబడ్డాడు రాజేశ్వరరావు. కండక్టరు విజిల్తో టేంకులా చప్పుడు చేస్తూ బైల్దేరింది బస్సు.

పంటకాలువమీద చల్లగాలి పలకరిస్తోంది.

నీలిఆకాశంలో రెండుకొంగలు అందంగా ఎగురుతున్నాయి.

దూరంగా కాలువలో పడవ తెరచాప, తెగి పడిన తెల్లమేఘం ముక్కలా వుంది.

కాలువవతల గట్టునెత్తిన తట్టలో వయ్యారంగా వూగుతూ నడుస్తోందో బిగువు రవిక పల్లెపడుచు.

ఇవేవీ శాంతపర్చలేదు రాజేశ్వర్రావుని. వీట్ని సుస్పష్టంగా చూడ్డానికే వన్నట్టు కళ్ళజోడు తీసి మళ్ళీ పెట్టేసుకున్నాడు, ఫ్రంటు సీటు పింజారీ.

కొన్ని లక్షణాలయ్యేక బస్సు కలియజూసేడు రాజేశ్వర్రావు, తన ఎడంపక్క పల్లెటూరి ముసలాడు ఆరిన చుట్ట నోట్లో పెట్టుకుని

సొంగ కారుస్తున్నాడు. కుడిపక్క మిల్లు ప్రొప్రయిటరు నిద్రపోతూ తనమీదికి వాలిపోతున్నాడు. తన కెదురుగా వున్నవా డెవడో చెప్పడం కష్టం. కాని బెంగ వాడి కళ్ళల్లో గూడు కట్టుకుంది. పిల్లకి పెళ్ళి చెయ్యాలో ఏమిటో? జాలిపడ్డాడు రాజేశ్వర్రావు. కాని వుండుండి ఎదుటివాడు పంచెలో చేతులు పెట్టి మోకాళ్ళు బరుక్కోడం రాజేశ్వర్రావు చూసినప్పుడు మాత్రం, జాలి బస్సు దిగిపోయి కోపా న్నెక్కించింది తన సీట్లో. ఎదుటివాడికి గజ్జుంది కాబోలు. తన మోకాళ్ళకి వాడి కాళ్ళు తగుల్తున్నాయి. ఛీ! ఛీ!! గజ్జి వెధవల్ని బస్సెక్కనివ్వకూడ దనుకున్నాడు.

అంతవరకూ సర్వ మానవులూ సమానులేనని ఎవరేన అంటే వినూరు కుండేవాడు రాజేశ్వర్రావు. ఇటుపైని ఎవరైనా ఆ మాటంటే మాత్రం-గజ్జి వెధవలూ, చొంగ కార్చేవాళ్ళూ, బస్సులో నిద్రపోయే మిల్లు ప్రొప్రయిటర్లూ మిగతా వాళ్ళతో సమానులు కారని చెప్పేయ దల్చుకున్నాడు.

తన ప్రక్కవాళ్ళనీ, ఎదుటి వాళ్ళనీ అసహ్యించుకున్నాక, వెనక్కి తిరిగి వెనకసీట్లు కలయజూసేడు రాజేశ్వర్రావు. అంతా ఆడ మళయాళం. ఎవరో యిద్దరు వయసొచ్చిన ఆడపిల్లలు మాత్రం ఫ్రీ్కాన్ టెస్టుకి తయారైనట్టు ముస్తాబయ్యేరు - బొంబే హెయిర్ స్టయిల్స్తో, కంపెనీ బాడీల్తో. ఛీ! ఎంత సిగ్గులేదో వీళ్ళ తల్లిదండ్రులకి. వీళ్ళకీ జన్మలో సినిమా ఛాన్సు రాన్సరిగదా, మంచి సినిమా చూసి అర్థం చేసుకునే యోగం కూడా లేదనుకున్నాడు. లోతులేని మనుషులు! అంతా పైజిలుగు.

రాజేశ్వర్రావు కెదురుసీట్లో ఒకసారి కూర్చున్నిద్దరు స్టూడెంట్సూ సినిమాల డిస్కషనులోకి దిగేరు. వాళ్ళలో ఒకడు పెద్దయ్యేక భగవదనుగ్రహం వుంటే దారాసింగుకి అన్నలాగా, అనుగ్రహం లేకపోతే తమ్ముళ్ళాగా ఔతాడు. రెండోవాడికి మాత్రం వయసే వస్తుంది కాని పెద్దవడు. యెండిపోయిన బీరకాయలా వున్నాడు. వాళ్ళ డిస్కషన్ సావిత్రీ, సాధనల మీదికి తిరిగింది. ఒకడు "సావిత్రి" మంచి అభినేత్రనీ, రెండోవాడు "సాధన" గొప్పదనీ తగువు పెట్టుకున్నారు. ఇద్దరూపన్నాసులే అనుకున్నాడు రాజేశ్వర్రావు. తారలు కాదు. స్టూడెంట్సు.

ఫ్రంటు సీటువాడి కీ సంభాషణ నచ్చనట్టుంది. కళ్ళజోడు తీసి స్టూడెంట్సువేపు తిరిగి "నాక్కారుంది తెల్సా. నా ఖర్మంకొద్దీ ఈ బస్సులో మీతో ఎక్కాల్సొచ్చింది. ఇహ నోర్ముయ్యండి" - అన్నట్టు చురచుర చూసి

'పుణ్యభూమీ కళ్ళుతెరు' నవలతో తెలుగు సాహిత్యంలో సంచలనం స్పష్టించిన ప్రఖ్యాత రచయిత శ్రీ బీనాదేవి (బి.నరసింగరావు) ఈనెల 5వ తేదీన దివంగతులయ్యారు. వారి స్మృతి చిహ్నంగా ఈ కథను పున ర్ముద్రిస్తున్నాం.

మళ్ళీ ముందుకి తిరిగిపోయాడు.

ఆ క్షణంలో రాజేశ్వర్రావుకి చొంగ కార్చేవాడి మీదకన్నా, మిల్లు ప్రొప్రయిటర్మీదకన్నా, ఫ్రీ్కాన్ టెస్టమ్మాయిలమీదకన్నా, గజ్జివాడి మీదకన్నా ఫ్రంటుసీటువాడిమీదెక్కువ కోపం వచ్చింది.

బస్సులో యెవరికి వచ్చింది వాళ్ళు మాట్లాడుకుంటారు. మధ్య వీడెవడు చూపుల్తో ఆక్షేపించడానికి. వీడిక్కారుంటే ఎవడిక్కావాలి? ఏనుగులుంటే ఎవడిక్కావాలి? ఆ ఇద్దరు పిల్లల పెళ్ళీ చేసేస్తే తనూ వేస్తాడు వీడి తాతల్లాంటి తెల్లిమ్పాట్లు. ఏం ఉద్యోగం వెలగబెడుతున్నాడో వెధవాయగారు? వేసుకున్న బట్టల ధోరణిబట్టి చూస్తే, మెడికల్ రిప్రజెంటేటివ్లా వున్నాడు, అంతే! అంతే!! ఏం సందేహం లేదు. మందుల సేంపిల్సేవీ డాక్టర్లకివ్వకుండా వాడే మింగేస్తున్నాడు కాబోలు. మహా ఆరోగ్యంగా ఉన్నాడు. గాడిదకొడుకు. రక్తం కనిపిస్తోంది వాడి బుగ్గల్లో. ఆరోగ్యం వెదజిమ్ముతున్నాయ్ వాడి మెరిసే కళ్లు. పట్టుమని పాతికేళ్ళైనా ఉండవు. ఇంతకీ క్రితం జన్మలో పెట్టిపుట్టే వుంటాడని సర్ది చెప్పుకున్నాడు రాజేశ్వర్రావు.

కాని ఫ్రంటు సీటువాడు బేగ్లోం చేదో ఇంగ్లీషు పుస్తకం తీసి నల్ల కళ్ళద్దాలు తీయకుండానే చదువు ప్రారంభించగానే మళ్ళీ చిర్రెత్తుకొచ్చింది రాజేశ్వర్రావుకి. ఏమిటా వెధవస్టయిలు? ఆ చదువేదో కళ్ళజోడు తీసి తగులడరాదూ. ఉండ చుట్టుకుపోయి మెడ మాత్రం సీటు బేక్ రెస్టుకి తగిలించి, సీటు చివర అంచున మహోన్నితంగా కూర్చుని మద్దూర్దుదగ్గరున్న గజానికి రెండు కాళ్ళూ నిగడదన్ని కూర్చున్నాడా ఫ్రంటుసీటువాడు. పెద్దగొయ్యేదైనావస్తే కిందపడి పచ్చడౌతాడు.

ఈవేళేం పచ్చడి చేసిందో తన యిల్లాలు? ఇంకోగంటలో తన ఊరు చేరిపోవచ్చు. ఇంకో వారంతో తనకీ, తన ఊరికీ ఋణం తీరిపోతుంది. ఆ వచ్చే రిలీవరు ఓ కార్డుముక్క రాస్తేనగూడదూ? డైరెక్టు రిక్రూటు దర్జా వెలగబెడ్తున్నాడు. ఉత్తరం రాయకుండా, పోనీ తనకేం వాడే బాధపడ్తాడు. వా డెప్పుడొస్తాడో తేలీపోతే బల్రటోతైనా బస్సు కెళ్ళడు, అతగాణ్ణాహ్వానించడానికి.

కాలువలో కాకులు స్నానం చేస్తున్నాయి. శివ శివ! ఏ చావువార్త వినాలో ఈవేళ. "ఈ బస్సులో యెవర్ని చంపేమంటావు" అని యమధర్మరాజు ప్రత్యక్షమై అడిగితే ఫ్రంటు సీటు వాణ్ని తడుముకోకుండా ఆ క్షణంలో అనేస్తాడు రాజేశ్వర్రావు.

ఏదో పల్లెటూళ్ళో బస్సాగింది. రోడ్డుతో పందెం వేసుకుని పక్కనే పరిగెడుతోంది పంటకాలువ. కాలువలో అనాయాసంగా పరిగెడుతున్నాయి తెరచాప,పడవలు.

పడవ్వాళ్ళ నల్ల శరీరాలు ఎండలో మెరుస్తున్నాయి.

రోడ్డుపక్కన ఓ ముస్లిం పిల్లడు వీధి కుక్కతో ఆడుకుంటున్నాడు. ఆకుక్క వాడి మొహం అంతా నాకుతోంది, ప్రేమగా.

బస్సు బైల్దేరింది. ఇక తమూరు చేరేసినట్టే. ఏముంది? ఇంక నాలుగు మైళ్లు. కాని బస్సు పోతున్న పల్లెలో సంత జరుగుతోంది. ఎటు చూసినా పశువులూ, మనుషులూ కోలాహలంగా వున్నారు. కురుక్షేత్రంలా ఉందంతా. దారివ్వని మనుషుల్ని, పశువుల్ని తప్పిస్తూ వాన చినుకుల మధ్య సహదేవుడు గుర్రాన్ని పోనిచ్చినట్టు పోనిస్తున్నాడు బస్సుని డ్రైవరు. రాజేశ్వర్రావు కళ్ళు మూసుకున్నాడు, నిద్రొచ్చేట్టుంది. పశువుల అరుపులు, మనుషుల కేకలు, పిల్లల ఏడుపు. బస్సు హోరను కలిసి ఘోష పెడ్తున్నాయి.

బస్సు జోరెక్కింది. కళ్లు మూసుకునే, బహుశా సంత దాటిపోయాం కాబోలనుకున్నాడు రాజేశ్వర్రావు. నిద్ర, జాగ్రదావస్థకి మధ్య పొలిమేరలో వున్నా డతను. బస్సు జోరు జాస్తి అవుతోంది. చెమటకి తడిసిన చొక్కాకి గాలి తగిలి హాయిగా వుంది.

ఇంతలోనే హారను మోత - బ్రేకుల చప్పుడు- బండి వాళ్ళ అరుపులు- అకస్మాత్తుగా కళ్ళు విప్పిన రాజేశ్వర్రావుకి ఎగురుతున్న చెట్లూ, రోడ్డుకడ్డంగా చెట్లని వెంట తరుముతూ నరుగెత్తే బస్సూ, అన్నిదిక్కులా పరుగెత్తుతున్న రెండెడ్ల బళ్ళూ - అన్నీ ఒక్కసారి కనిపించి - మరి - కనిపించడం మానేశాయి, పెద్ద చప్పుడుతో.

అతను మళ్ళా కళ్లు విప్పేసరికి మొహాని కంతా కాయితాలంటించినట్టుంది. వంట్లో నీరసం జాస్తీగా వుంది. చేతులకి కట్లున్నాయి. బాధగా మూలిగాడు.

"అదృష్టవంతులు ఏం ఫర్వాలేదు, అన్నీ చిన్న దెబ్బలే. బాగా షాక్ తిన్నాడంతే. రేపు డిశ్చార్జి చేసేస్తా" అన్నారు, అతనికి తెలిసిన గవర్నమెంటు డాక్టరు గారు. అప్పటిగ్గాని అతనికి పరిసరాలూ, పరిస్థితులూ గుర్తుకు రాలేదు. మంచం దగ్గర కాళ్ళవేపు గుడ్ల నీరు కక్కుతూ నిలబడింది తన భార్య. బస్సు దేన్నో గుద్దేసుంటుంది.

"మరే, ఆ ఫ్రంటుసీట్లో వుంటే ఏమయ్యుండేదో?ఊహించడానికి భయమేస్తోంది" అన్నారు, డాక్టరు గారు ఇంగ్లీషులో.

దాంతో బాగా తెలివొచ్చేసింది రాజేశ్వర్రావుకి. "ఏం? ఏమైంది?" అని అడిగాడు.

"డ్రైవరూ, ఫ్రంటుసీట్లో వున్నాయనా వెంటనే చచ్చిపోయారు. మిగతా అందరికి ప్రాణభయం లేదు."

రాజేశ్వర్రావు మాట్లాడలేదు.

ద్వారంలోనుండి సాయంత్రం నీరెండ చతురస్రాకారంలో గదిలో పడుతోంది.

పక్షు లరుస్తూ తమ యిళ్ళకి వెళ్లిపోతున్నాయి. మళ్ళీ ఈ ఎండా, ఈ పక్షులూ రేపు వస్తాయి. రేపు తను డిశ్చార్జి ఐపోతాడు.

కాని ఆ ఫ్రంటు సీటువాడికి రేపు లేదు. పట్టుమని పాతికేళ్ళయినా తిరక్కుండానే బలవంతం చావు చచ్చిపోయాడు.

ఆలోచిస్తున్న రాజేశ్వర్రావు. "ఆ ఫ్రంటు సీట్లో వున్నదెవరో తెలుసా; మీ రిలీవర్" అన్న డాక్టరు మాటకి ఝళ్ళిపడ్డాడు.

ఆ రిలీవర్ని చూడకముందు తిట్టేడు. చూసేక ఆక్షేపించేడు.

అతడు తన ఉద్యోగం నుండి రిలీవ్ చెయ్యడానికి వస్తున్నాడు.

ఫ్రంటుసీటు నుండి రిలీవ్ చేశాడు.

మృత్యువు నుండి కూడా రిలీవ్ చేశాడు.

అతను కేవలం రిలీవర్ కాదు; ప్రాణదాత. సిగ్గుతో చేతుల్తో మొహం కప్పుకున్నాడు.

తాసిల్దార్ రాజేశ్వర్రావుకి తెగ దుఃఖం వచ్చింది.

(రా.వి. శాస్త్రిగారి 'కార్నర్సీటు' చదివేక)